క్లుప్తంగా

దుర్గమ్మకు నృత్య నీరాజనం




ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు హైదరాబాద్‌కు చెందిన పలువురు నృత్య కళాకారులు నృత్య నీరాజనాలను అర్పించారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీనటరాజ నృత్యానికేతన్‌కు చెందిన దుర్గాభవానీ పర్యవేక్షణలో పలువురు విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై నిర్వహించిన నృత్య ప్రదర్శనను భక్తులు ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించారు. పలు కీర్తనలకు చిన్నారులు ఎంతో లయబద్ధంగా నృత్య ప్రదర్శన ఇవ్వగా భక్తులు వారిని అభినందించారు. అనంతరం ఆలయ అధికారులు నృత్య బృందానికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు


పటమట(విజయవాడతూర్పు): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి నేపథ్యంలో సోమవారం విజయవాడ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు నగరంలోని మూడు జోనల్ కార్యాలయాల్లో జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దయిందని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

దివ్యాంగులకు అండగా లయన్స్ క్లబ్



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కృత్రిమ అవయవాలను అందజేస్తూ దివ్యాంగులకు తమ క్లబ్స్ అండగా ఉంటున్నాయని లయన్స్ ఇంటర్నేషనల్ (డిస్ట్రిక్ట్–316డీ) జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి చెప్పారు. స్థానిక సున్నపుబట్టీల సెంటర్‌లో ఉన్న ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) హాలులో లయన్స్ క్లబ్ (డిస్ట్రిక్ట్–316డీ) 27వ వార్షిక కన్వెన్షన్‌ను స్పందన పేరుతో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దె శేషగిరి మాట్లాడుతూ దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందజేయడం ద్వారా వారు సాధారణ జీవితాన్ని పొందడమే కాకుండా కొన్ని వృత్తులు, ఉద్యోగాలు చేసుకుంటూ కుటుంబానికి అండగా ఉంటారని చెప్పారు. కృత్రిమ అవయవాలతో పాటుగా తోపుడుబండ్లు, ఇస్త్రీపెట్టెలు, కుట్టు మిషన్లు, రిక్షా బండ్లు ఇస్తూ.. వారికి జీవనోపాధి కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా వైస్ గవర్నర్లు వీవీపీఎస్ ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి, పలువురు మాజీ గవర్నర్లు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సత్కారం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఎన్‌ఆర్‌ఐ కళాశాల సీఈఓ చంద్రశేఖర్, డీన్ సూర్యనారాయణ అభినందించారు. ఆదివారం భవానీపురంలోని ఎన్‌ఆర్‌ఐ కళాశాల బ్రాంచ్‌లో అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఈఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ కళాశాలకు చెందిన రెండో సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఐ. స్వాతి ఐశ్వర్యలక్ష్మి 1000 మార్కులకుగాను 990, మొదటి సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో ఆర్. వర్ష కన్వర్ 470 మార్కులకు గాను 466, బైపీసీలో ఎం. మేఘన 440 మార్కులకు గాను 433 సాధించి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐ కళాశాల నగరంలో వివిధ బ్రాంచ్‌ల ప్రిన్సిపాల్స్ సతీష్, అరవింద్, మారుతీ కృష్ణ, జయచంద్ర, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉచిత యోగా శిక్షణ తరగతులు

పటమట(విజయవాడతూర్పు): నేటి కాలంలో యోగా మంచి జీవన విధానం అని, క్రమం తప్పకుండా అందరూ అభ్యాసం చేయాలని గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. ఆదివారం పటమటలోని దత్త పీఠంలో జరిగిన దత్తక్రియ యోగా శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. యోగాసనాలపై అవగాహన కల్పించారు. దత్త క్రియా యోగ అంతర్జాతీయ కేంద్రం, మైసూర్ ప్రిన్సిపాల్ డాక్టర్ శివ ప్రకాష్ మాట్లాడుతూ నగరంలో మూడు రోజుల పాటు జరిగే ఈ యోగా శిక్షణ తరగతులు దత్తపీఠంలో ఉచితమన్నారు. ప్రతిరోజు కనీసం 40 నిమిషాల పాటు ధ్యానం చేయాలని, తద్వారా ఎన్నో శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ప్రయోజనాలు పొందవచ్చని ఆయన తెలిపారు. దత్త క్రియా యోగ పటమట ప్రాంత సమన్వయకర్త అరుణ మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు పటమటలోని శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమంలో నిత్య సాధనా తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివరాలకు 9866041332లో సంప్రదించాలని సూచించారు.

బిక్కుబిక్కుమంటున్న వ్యాపారులు

కేబీఎన్ కాంప్లెక్స్ పెచ్చులు ఊడుతుండటంతో ఆందోళన

- సెల్లార్‌లో పెచ్చులు పడటంతో ధ్వంసమవుతున్న వాహనాలు
- పట్టించుకోని వీఎంసీ ఎస్టేట్ విభాగం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న వ్యాపారులు, వినియోగదారులు



పాతబస్తీలోని కేబీఎన్ మునిసిపల్ కాంప్లెక్స్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని కాకరపర్తి భావనారాయణ మునిసిపల్ కాంప్లెక్స్‌లో వ్యాపారులను కలవరపాటుకు గురి చేస్తోంది. నగరపాలకసంస్థ అధికారుల నిర్లక్ష్యంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని వ్యాపారులు, వినియోగదారులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. వన్‌టౌన్‌లోని భావనారాయణవీధి, పులిపాటి వారి వీధి రెండు రహదారులను కలుపుతూ కాకరపర్తి భావనారాయణ మునిసిపల్ కాంప్లెక్స్ ఉంది. ఈ కాంప్లెక్స్‌లో వందకు పైగా చిన్న, పెద్ద దుకాణాలు పని చేస్తున్నాయి. వాటికి తోడు కాంప్లెక్స్ దిగువన సెల్లార్‌లో వాహనాల పార్కింగ్‌కు నగరపాలకసంస్థ లీజుకు ఇచ్చింది. నిత్యం వేలాది మంది వినియోగదారులతో పాటుగా వ్యాపారులు ఈ కాంప్లెక్స్‌లో రాకపోకలు సాగిస్తుంటారు.

ప్రమాదభరితంగా శ్లాబ్..

కాకరపర్తి భావనారాయణ కాంప్లెక్స్ సెల్లార్, మొదటి అంతస్తులకు సంబంధించిన శ్లాబ్‌ల నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి. నిత్యం ఏక్కడో ఒకచోట శ్లాబ్ నుంచి పెచ్చులు ఊడిమీద పడటంతో వ్యాపారులు భయకంపితులవుతున్నారు. అలాగే సెల్లార్‌లోని పలు చోట్ల శ్లాబ్ భాగం నుంచి సిమెంట్ రాళ్లు ఊడిపడుతుండటంతో వాహనాలు ధ్వంసమవుతున్నాయి. పలుమార్లు వాహనాలను పార్కింగ్ చేసి వెళ్లటానికి వచ్చిన వినియోగదారులపైన పడటంతో చిన్నపాటి దెబ్బలు సైతం తగిలి ఆస్పత్రికి పరుగెత్తాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దాంతో వ్యాపార వర్గాలతో పాటుగా కొనుగోళ్లకు వచ్చే వినియోగదారులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



శ్లాబ్ నుంచి ఊడుతున్న పెచ్చులు



సెల్లార్‌లో ద్విచక్ర వాహనంపై పడిన పెచ్చులు

పట్టించుకోని అధికారులు..

కాంప్లెక్స్ లీజు వ్యవహారాలను పర్యవేక్షించే విజయవాడ నగరపాలకసంస్థ ఎస్టేట్ విభాగం అధికారులు భవనంపై ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకోవటం లేదని వ్యాపారులు చెబుతున్నారు. ప్రధానంగా పెచ్చులు ఊడి పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వివరిస్తున్నా పెడచెవిన పెడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. దురదృష్టవశాత్తూ పెద్ద ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదంటూ వారు ప్రశ్నిస్తున్నారు. నగరపాలకసంస్థ ఉన్నతాధికారులు దీనిపై దృష్టి పెట్టాలని వినియోగదారులు, వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీని పటిష్టం చేద్దాం

పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు నాయకులందరూ పాటుపడాలని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. నియోజకవర్గంలో వివిధ జిల్లా పార్టీ పదవులను పొందిన నేతలతో వెలంపల్లి శ్రీనివాసరావు తన కార్యాలయంలో ఆదివారం సాయంత్రం సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా తిరిగి నియమితులైన వెలంపల్లి శ్రీనివాసరావును సమావేశంలో పాల్గొన్న నాయకులు దుశ్శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ రానున్న కాలంలో అధికారంలోకి రావటానికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సయ్యద్ అతీక్, పదిలం రాజశేఖర్, మజ్జి శ్రీనివాసరావు, కేసరి సుబ్బారెడ్డి, చిన్నోడు, వీర్నాల లీలమధు, బండారి వెంకట్, జిల్లాలోని వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు పడిగపాటి చైతన్యరెడ్డి, షేక్ మస్తాన్, పోలిమెట్ల శరత్, మెట్టు వెంకట రెడ్డి, విశ్వనాథ రవి, యరడ్ల ఆంజనేయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెలంపల్లి శ్రీనివాసరావును సత్కరిస్తున్న పార్టీ నేతలు

ఒక్కడు కాదు ఇద్దరొచ్చారు!

- సీసీ ఫుటేజీలో గుర్తించిన దేవస్థానం
- ఇంద్రకీలాద్రిపై భద్రతా వైఫల్యంపై విచారణకు ఆదేశం

సాక్షి స్పందన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అర్ధరాత్రి అడ్డదారిలో కొండపైకి చేరుకున్న వ్యక్తి వ్యవహారంపై ఆలయ ఈవో కె.రామచంద్రమోహన్ విచారణకు ఆదేశించారు. 'ఇంద్రకీలాద్రిపై భద్రతా వైఫల్యం' శీర్షికన సాక్షి ప్రచురించిన కథనానికి ఆలయ అధికారులు స్పందించారు. ఈ వ్యవహారంపై లోతుగా దర్యాప్తు చేసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని ఈవో పేర్కొన్నారు.

అడ్డదారిలో కొండెక్కింది ఇద్దరు..

మరో వైపున ఈ వ్యవహారానికి సంబంధించి ఆలయ అధికారులు సీసీ ఫుటేజీని పరిశీలించిన క్రమంలో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. కొండపైకి అడ్డదారిలో వచ్చింది ఒక్కరు కాదు.. ఇద్దరని తేలింది. మరో వైపున సెక్యూరిటీ పట్టుకున్న ఆగంతకుడికి తెలుగు రాదని.. హిందీలో మాట్లాడినట్లు తేలింది. ఇది గమనించిన రెండో వ్యక్తి పరారైనట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై మల్లేశ్వరాలయంలో బందోబస్తులో ఉన్న హోంగార్డుతో పాటు సెక్యూరిటీ గార్డు నుంచి కూడా అధికారులు స్టేట్‌మెంట్ తీసుకుంటున్నారు. అయితే ఈ ఘటనలో గూర్ఖా అదుపులోకి తీసుకున్న ఆగంతకుడిని రథం సెంటర్‌లో ఉన్న రక్షక్ వాహనానికి అప్పగించినట్లు పేర్కొంటున్నారు. ఇదే విషయాన్ని గూర్ఖా ఆలయ అధికారులకు తెలియజేయడంతో ఇప్పుడు అసలు వ్యవహారంలో ఏం జరిగిందనే దానిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆలయ భద్రతకు సంబంధించి వ్యవహారంలో వన్‌టౌన్ పోలీసులు అంత సాదాసీదాగా ఏ విధంగా వ్యవహరించారో అర్థం కావడం లేదని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

దారి మధ్యలోనే వదిలేశారు..

అర్ధరాత్రి వేళ అడ్డదారిలో కొండపైకి చేరుకున్న ఆగంతకుడిని రక్షక్ సిబ్బంది వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించకుండా దారి మధ్యలోనే వదిలిపెట్టడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అసలు ఘటన జరిగినట్లే తమ దృష్టికి రాలేదని చెబుతున్న వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్, రాత్రి వేళ గస్తీ సమయంలో ఇంత ప్రాధాన్యం ఉన్న అంశాన్ని పోలీసు సిబ్బంది అంత తేలికగా తీసుకోవడం విమర్శలకు తావిస్తోంది.

మార్మోగిన క్రీస్తు జయోత్సాహ నినాదం

పెద్ద ఎత్తున సాగిన మట్టల ఆదివారపు ర్యాలీలు



ఫ్రైజర్ పేటలో ర్యాలీ నిర్వహిస్తున్న బాప్టిస్టు సంఘ సభ్యులు

వించిపేట(విజయవాడపశ్చిమ): హోసన్నా జయం.. రాజుల రాజునకు జయం.. క్రీస్తు ఏసునకు జయం.. అంటూ చిన్నారులు రోడ్లపై నినాదాలు చేశారు. మట్టల ఆదివారం నేపథ్యంలో వాడవాడలా చర్చిల్లోని సండేస్కూల్ పిల్లలు ఈత మట్టలను చేత పట్టుకొని నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. చిట్టినగర్, ఫ్రైజర్‌పేటలోని తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో చిన్నారులు పెద్ద సంఖ్యలో రకరకాల పూలతో అందంగా అలంకరించిన ఈత మట్టలతో ర్యాలీ నిర్వహించారు. చర్చి పాస్టర్ నిక్సన్ ఆండ్రూస్ ప్రత్యేక ప్రార్థనలతో ఊరేగింపు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ లోక రక్షకుడైన ఏసు ప్రభువు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని కోరారు. సంఘ పెద్దలు ముల్లపాటి ప్రకాష్, జెర్ర జోషి, వినుకొండ సువర్ణ కుమార్, ఇరుగు దేవరాజ్, మండ్లూరి బేబీ, కొడవటి సల్మాన్, పెద్ద సంఖ్యలో చిన్నారులు, మహిళలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ర్యాలీ..

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కొట్టేటి కోటయ్య వీధిలోని చర్చిలో ఆదివారం నిర్వహించిన మట్టల ఆదివారం ఆరాధన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. సంఘ కాపరి పుట్ల సత్యవేదం, చర్చి పాస్టర్ శామ్యూల్ సుమంత్, సంఘ పెద్దలు, యూత్, విశ్వాసులు కలిసి కుమ్మరిపాలెం సెంటర్ నుంచి రావిచెట్టు సెంటర్, పున్నమీఘాట్, నాలుగు స్తంభాల సెంటర్, ఆర్‌సీఎం చర్చి మీదుగా తిరిగి కొట్టేటి కోటయ్య వీధిలోని చర్చి వరకు సాగింది. ఇందులో క్రీస్తు సేవలు, అద్భుతాలను కొనియాడుతూ స్తోత్రాలు చెల్లించారు. రెండు వేల సంవత్సరాల క్రితం ఏసు ప్రభువు యెరూషలేం జయప్రవేశం చేసిన సన్నివేశాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటూ నినాదాలు చేశారు.



కోటయ్య వీధిలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

దుర్గగుడికి పోటెత్తిన భక్తజనం

- రద్దీ నేపథ్యంలో అంతరాలయ దర్శనం రద్దు
- సర్వ దర్శనానికి రెండు గంటలు



అమ్మవారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు


ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వీకెండ్, వరుస సెలవులు, ఇంటర్ పరీక్ష ఫలితాలతో అమ్మవారి శుభాశీస్సుల కోసం విచ్చేసిన విద్యార్థులు, పలువురు కొత్త జంటలు, వారి కుటుంబ సభ్యులతో ఇంద్రకీలాద్రిపై పండుగ వాతావరణం కనిపించింది. ఆదివారం తెల్లవారుజాము నుంచే ఇంద్రకీలాద్రికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఉదయం 10 గంటలకే ఘాట్‌రోడ్డు ద్విచక్ర వాహనాలతో నిండిపోగా, హెడ్ వాటర్ వర్క్స్, సీతమ్మ వారి పాదాలు, కెనాల్‌రోడ్డులో కార్లు, ఇతర రవాణా వాహనాలతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఘాట్‌రోడ్డు, మహా మండపం మీదగా కొండపైకి చేరుకున్న భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి.

భక్తులకు మజ్జిగ పంపిణీ..

ఘాట్‌రోడ్డులో సమాచార కేంద్రం, మహా మండపంలో ఆరో అంతస్తు వరకు క్యూలైన్లు నిండిపోవడంతో అంతరాలయ దర్శనం రద్దు చేశారు. ఘాట్‌రోడ్డు, మహా మండపం దిగువన ఉన్న కౌంటర్లలో రూ.500 టికెట్లు విక్రయించవద్దని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో వీఐపీలకు, ప్రముఖులకు, సిఫార్సులపై వచ్చే వారికి సైతం ముఖ మండప దర్శనం కల్పించారు. రూ.300, రూ.100 టికెట్ల క్యూలైన్ కూడా భారీగా ఉండటంతో వారికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా దేవస్థాన అధికారులు చర్యలు తీసుకున్నారు. క్యూలైన్లు త్వరత్వరగా ముందుకు కదిలేలా చర్యలు తీసుకున్నారు. ఎండ వేడి నుంచి భక్తులకు ఉపశమనం కలిగించేందుకు ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం, లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద మజ్జిగను పంపిణీ చేశారు. ఇక అమ్మవారికి నిర్వహించిన ఆర్జిత సేవలతో పాటు సాయంత్రం పంచహారతుల సేవలోనూ ఉభయ దాతలు పాల్గొన్నారు.

అనుబంధాల సంబరం.. అ'పూర్వ' సమ్మేళనం

సందడిగా విక్రమ్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల సమావేశం



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన విక్రమ్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు

పటమట(విజయవాడతూర్పు): మధ్యప్రదేశ్ ఉజ్జయినిలోని విక్రమ్ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం పటమటలో సందడిగా జరిగింది. విక్రమ్ యూనివర్సిటీలో 1960 దశకం నుంచి ఇప్పటి వరకు వివిధ బ్రాంచులు, కోర్సుల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఎం.ఫిల్, డాక్టరేట్ చేసిన వారంతా ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన పూర్వ విద్యార్థులు తమ వయస్సును, దూరాభారాన్ని సైతం లెక్క చేయకుండా వచ్చి, ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరిలో ప్రఖ్యాత విద్యావేత్తలు, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ ప్రతిష్టాత్మక సంస్థల్లో కీలక హోదాల్లో పని చేసిన, చేస్తున్న వారే కాకుండా పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు ఉన్నారు. ఈ సందర్భంగా వారు విక్రమ్ విశ్వ విద్యాలయం తమను ఏ విధంగా తీర్చిదిద్దిందో, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడంలో ఏ విధంగా తోడ్పడిందో వివరించారు.

గురువుకు నివాళి..

అనంతరం విక్రమ్ యూనివర్సిటీలో జియాలజీ విభాగాధిపతిగా పని చేసి, ఎందరెందరో తెలుగు విద్యార్థులు అక్కడ చదువుకునేందుకు తోడ్పడిన ప్రొఫెసర్ సూర్యదేవర సుబ్బారావును స్మరించుకుని, ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. దివంగతులైన తమ తోటి విద్యార్థులకు శ్రద్ధాంజలి ఘటించి, వారితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. వర్సిటీ ప్రస్తుత వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ అర్పణ్ భరద్వాజ్ వీడియో సందేశం పంపారు.

గణపతి సచ్చిదానందస్వామి సేవలో వెలంపల్లి, మల్లాది విష్ణు



గణపతి సచ్చిదానంద స్వామి ఆశీస్సులు అందుకుంటున్న వెలంపల్లి, మల్లాది విష్ణు

విజయవాడ కల్చరల్: అవధూత గణపతి సచ్చిదానంద స్వామిని మాజీ దేవదాయ శాఖామంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు మాజీ చైర్మన్ మల్లాది విష్ణు ఆదివారం రాత్రి పటమట దత్తపీఠంలో కలుసుకుని ఆశీస్సులు అందుకున్నారు. స్వామిజీ వారితో ముచ్చటిస్తూ జూన్ ఐదు నుంచి 15వ తేదీ వరకు మైసూర్ దత్త పీఠంలో జరిగే వృక్ష మహాయజ్ఞానికి విచ్చేయమని ఆహ్వానించారు. దీంతో వారు తప్పక హాజరు అవుతామని తెలిపారు. కాగా నగరంలో బబ్బూరి గ్రౌండ్స్‌లో జరుగుతున్న కార్యక్రమానికి స్వామిజీ ఆదివారం హాజరయ్యారు.

అక్కినేని నటన భావినటులకు ఆదర్శం



బెజవాడ బార్ అసోసియేషన్ సభ్యులను సత్కరించిన నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: సినీ నటుడు అక్కినేని నటజీవితాన్ని భావినటులు ఆదర్శంగా తీసుకోవాలని అక్కినేని నాగేశ్వరరావు ఫౌండేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు చీదెళ్ల నాగేశ్వరరావు అన్నారు. అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, జీఎస్ఎస్ సరాగాలు ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం సినీ సంగీత విభావరి, బెజవాడ బార్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన సభ్యులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చీదెళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు సినిమా చరిత్రలో అక్కినేని యుగం స్వర్ణయుగమని పేర్కొన్నారు.

బెజవాడ బార్ అసోసియేషన్ సభ్యులకు సత్కారం

బెజవాడ బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ఏకే బాషా, ఉపాధ్యక్షుడు పిళ్లా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కేవీ రంగారావు, క్రీడల కార్యదర్శి పలగాని రవిబాబు, కోశాధికారి ఎం. సత్యనారాయణ, గ్రంథాలయ కార్యదర్శి కంచర్ల త్రినాథ్ కుమార్, మహిళా కార్యదర్శి కే అనూరాధ, జాయింట్ సెక్రటరీ జి. వరాహలక్ష్మిని ఆత్మీయంగా సత్కరించారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం






ఆలయ ప్రాంగణంలో వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం : కల్యాణోత్సవంలో పాల్గొన్న ఉభయదాతలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీపద్మావతి వీఎల్‌సీసీఎస్ లిమిటెడ్ అధ్యక్షుడు కుంచెం శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై శ్రీదేవి, భూదేవి, వేంకటేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. స్వామి వారికి వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాస్, బీజేపీ నాయకులు దర్శించుకున్నారు. 108 మంది ఉభయదాతలు స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొని తరించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది.

బీసీల ఆత్మగౌరవానికి ప్రతీక బీపీ మండల్



భవానీపురం(విజయవాడపశ్చిమ): బీసీ రిజర్వేషన్ల పితామహుడు, సామాజిక న్యాయ కోవిదుడు బిందేశ్వర్ ప్రసాద్ మండల్ (బీపీ మండల్) బీసీల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని ఏపీ పీటీడీ (ఆర్టీసీ) బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్పీ శేషగిరిరావు అన్నారు. బిహార్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బీపీ మండల్ వర్ధంతి సందర్భంగా అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో బీపీ మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం శేషగిరిరావు మాట్లాడుతూ 27 శాతం ఓబీసీ రిజర్వేషన్లు కల్పించిన మహనీయుడు బీపీ మండల్ అన్నారు. మేజిస్ట్రేట్‌గా ఒక్క రూపాయి వేతనం కూడా తీసుకోకుండా నిజాయతీగా పని చేసిన ఆదర్శప్రాయుడని కొనియాడారు. కార్యక్రమంలో భవానీపురం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాదల తిరుపతిరావు యాదవ్, టి. పూర్ణయ్య, ఎం. మోజస్, పి. వెంకటేశ్వరరావు, సాంబశివరావు, ప్రమీల, జి. విజయ బాబు తదితరులు పాల్గొని బీపీ మండల్‌కు నివాళులర్పించారు.

● గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తన భర్త చావుకు కారణమైన వారిని శిక్షించాలని కోరుతూ ఓ వివాహిత భవానీపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గొల్లపూడి వన్‌సెంటర్‌కు చెందిన కోకా శశిరేఖకు చంద్రశేఖర్‌తో 2021లో వివాహమైంది. చంద్రశేఖర్ అనారోగ్యంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. అయితే ఆసుపత్రిలో చేర్చిన విషయం కూడా తనకు చెప్పలేదని, తన భర్త బతకడానికి అవకాశం ఉన్నప్పటికీ ఆస్తిని కాజేయాలనే ఉద్దేశంతో అత్త పద్మావతి, బావ వెంకటశివకుమార్, తోడికోడలు అపర్ణ ఉద్దేశపూర్వకంగానే చంద్రశేఖర్ చావుకు కారణమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఎస్‌జీఎఫ్‌ఐ పోటీల్లో సత్తా

విజయవాడస్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) అండర్–17 వెయిట్‌లిఫ్టింగ్, అండర్–19 తంగ్–టా మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ఏపీ విద్యార్థులు సత్తా చాటినట్లు ఎస్‌జీఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తిరాజు తెలిపారు. ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకు మణిపూర్‌లోని ఇంఫాల్‌లో ఈ పోటీలు జరిగినట్లు తెలిపారు. వెయిట్ లిఫ్టింగ్ 17 బాలికల 71 కేజీల విభాగంలో చల్లాబత్తుల జుహితగుణ(కాకినాడ) బంగారు పతకం, 59 కేజీల విభాగంలో చుక్కా కీర్తన(ఏలూరు జిల్లా) రజత పతకం, 76 కేజీల విభాగంలో బిత్ర రోచిస్మతి(గుంటూరు జిల్లా) రజత పతకం, తంగ్–టా మార్షల్ ఆర్ట్స్ అండర్–19 బాలికల 62 కేజీల విభాగంలో మనుబోలు భాను ప్రియ(ఎన్టీఆర్ జిల్లా) కాంస్య పతకం, 70 కేజీల విభాగంలో పుడి దుర్గ(అనకాపల్లి జిల్లా) కాంస్య పతకం సాధించినట్లు వెల్లడించారు. జాతీయ పోటీల్లో రాష్ట్రానికి బంగారు, రెండు రజిత, రెండు కాంస్య పతకాలు అందించిన క్రీడాకారులను, కోచ్‌లు కె.నాగశిరీష్, వి.కొండబాబులను పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ విజయరామరాజు అభినందించారు.



వెయిట్‌లిఫ్టింగ్, మార్షల్ ఆర్ట్స్ జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన రాష్ట్ర క్రీడాకారులు